

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-చింతపల్లి : వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మైనర్లు ద్విచక్ర వాహనాలు లేదా ఆటోలు నడపడం అసలు సహించబోమని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ పత్రాలు, కాలుష్య ధ్రువీకరణ పత్రం, హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు కుటుంబాలకు తీవ్ర విషాదాలు నింపుతున్నాయని తెలిపారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై సూచనలు చేసి, అవగాహన పత్రికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు ధనుంజయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పునరావాసానికి తొలి ప్రాధాన్యత

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి ◆ మంటూరు బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ

◆ పోలవరం నిర్వాసితులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, దేవీపట్నం విలేకరి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్నారు. అభివృద్ధికి రోడ్లు, ప్రాజెక్టులు అవసరమేనని, అయితే మనుషుల ప్రాణాలను ప్రాణంగా పెట్టడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని తెలిపారు. మానవతా దృక్పథం లేకుండా అమానవీయంగా వ్యవహరిస్తే ఎర్రజెండా చిట్ట చివరి వరకూ పోరాడుతుందని హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు పోలవరం నిర్వాసితులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. దేవీపట్నం మండలం మంటూరు ఆర్అండ్ఆర్ కాలనీలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణానికి రూ.55 వేల కోట్ల వ్యయానికిగాను కేవలం కేంద్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్లు విడుదల చేసిందని, ఆ నిధులలోనూ గడిచిన కొన్నాళ్లలో పాలక ప్రభుత్వాలు కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశాయని వివరించారు. వాటిలో అత్యధిక భాగం లూటీ జరిగినట్లు స్పష్టమవుతోందని అన్నారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు దోచుకున్నారని కాలనీలను సందర్శిస్తే అర్థమవుతోందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పునరావాసానికి కావలసిన నిధులను తక్షణం విడుదల చేయాలన్నారు. ముంపు ప్రాంతాలలో గతంలో చేసిన సర్వే పూర్తిగా తప్పుల తడకగా జరిగిందని, ఫలితంగా పునరావాస కాలనీలు సైతం ముంపు బారిన పడుతున్నాయని మండిపడ్డారు. 1986, 2022 వరదల ఆధారంగా రీ సర్వే చేయాలని, ప్రతి కుటుంబానికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి, పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలన్నారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అర్హుల జాబితాన్ని రూపొందించాలన్నారు. ప్రాజెక్టు కింద మునిగిన సాగు భూములకు భూమికి భూమి ఇవ్వడంతో పాటు రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



పూలు జల్లుతూ సిపిఎం బృందానికి స్వాగతం పలుకున్న పోలవరం నిర్వాసితులు



మంటూరు కాలనీలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎం.ఎ.బేబీ, వేదికపై లోకనాథం, సురేంద్ర, కిరణ్

పోలవరం నిర్వాసితులలో కుటుంబంలో ఒక్కరికైనా నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు, పీసా, 1/70, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలన్నారు. ఐఎఎస్ అధికారిని నియమించి పునరావాస కాలనీలో సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. డివిజన్ కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించి ప్రజారోగ్యాన్ని రక్షించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిర్వాసితులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏజెన్సీలోని అడవులను అదానీకి అప్పజెప్పే ప్రయత్నం చేస్తోందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ఎంపీ, ఎమ్మెల్యేలను తిరగనివ్వబోమని హెచ్చరించేలా పార్టీలకతీతంగా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 20 సంవత్సరాలుగా పోలవరం నిర్వాసితులకు అండగా సిపిఎం చేసిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్, నిర్వాసితుల సంఘం నాయకులు ఎస్.వెంకటరెడ్డి, సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు సూరిబాబు, శాంతిరాజు, లాయర్లు రవితేజ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోడు వింటూ.. బాసటగా నిలుస్తూ..

పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల్లో సిపిఎం బృందం పర్యటన

అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల్లో సిపిఎం బృందం శనివారం నిర్వహించిన పర్యటనలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఏ ఇంటి తలుపు తట్టినా బాధితులంతా తమ గోడును విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన తమను ప్రభుత్వాలు గాలికొదిలేశాయని చెప్పుకొచ్చారు. జీవచ్ఛవాల్లా బతుకుతున్నామని కొందరు కంటతడిపెట్టారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంతో కూడిన పార్టీ బృందం తాళ్లూరు, నాగులపల్లి పునరావాస కాలనీల్లో విస్తృతంగా పర్యటించింది. తాళ్లూరు కాలనీలో 240 కుటుంబాలకు, నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆయా కాలనీలలో ఇంటింటికీ సిపిఎం నేతలు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులకు అక్కడి ప్రజలు సాదర స్వాగతం పలికారు. పూలుజల్లుతూ, హారతులిస్తూ తమ ప్రాంతాలకు ఆహ్వానించారు. తమ సమస్యలను విన్నవించడంతో పాటు వినతి పత్రాలను అందజేశారు. పునరావాస కాలనీల్లో నిర్మించిన ఇళ్లలో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని నిర్వాసితులు తెలిపారు. తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసం విషయంలో ప్రభుత్వం కనీస మానవత్వం పాటించలేదని మండిపడ్డారు. ఇళ్లు అనడానికి కూడా వీల్లేని పద్ధతుల్లో కాలనీలు నిర్మించారన్నారు.



పునరావాస కాలనీ వాసుల కష్టాలను తెలుసుకుంటున్న ఎం.ఎ.బేబీ, లోకనాథం



పాడేరు ఘాట్ 12వ మైలు వద్ద కురుస్తున్న వర్షం

పాడేరు ఘాట్‌లో విభిన్న వాతావరణం

-ఉదయం పొగమంచు..మధ్యాహ్నం భారీ వర్షం..

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గత కొన్ని రోజులుగా ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తుంది. మధ్యాహ్నం భారీ వర్షాలు కురుస్తోంది. పాడేరు ఘాటీలో శనివారం విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాస్త ఎండ కాసింది. మధ్యాహ్నం పన్నెండు తర్వాత ఘాటీ సగం వరకు పొగమంచు కమ్మేసింది. ఒంటిగంట తర్వాత కుంభవృష్టిగా వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో ఘాటీలో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించ లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు శనివారం కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు కూలుతాయేమోనన్న భయంతో ప్రయాణం సాగించారు. ఎప్పుడు, ఎక్కడ చెట్టు కూలి రాకపోకలు నిలిచి పోతాయోనని వాహనదారులు ఆందోళన చెందారు.



కురుస్తున్న పొగమంచు

108 సిబ్బందికి సిఐటియు సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: 108 ఫౌండేషన్ డే సందర్భంగా 108 సిబ్బందిని సిఐటియు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా స్టేట్ యూనియన్ ట్రెజరర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 108 ఫౌండేషన్ స్థాపించి నేటికీ 20 సంవత్సరాలు అయిన సందర్భంగా సిబ్బందిని సత్కరించామన్నారు. సత్యం రామలింగ రాజు ఆపదలో ఉన్న ఎంతోమందికి సహాయం అందాలని ఉద్దేశంతో 108ని స్థాపించడం జరిగిందన్నారు. 108 ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచిందని ఇందులో కీలక పాత్ర పోషించిన పైలట్, ఈఎంటి లను సత్కరించడం మన బాధ్యత అని తెలియజేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి 108 సిబ్బందిని సత్కరించారు.రిఫర్ కేసుల కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్యులు వివేక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జిటిఎస్ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి


ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మెకానిక్ ఈశ్వరరావు ఇంటి సమీపంలోని డ్రైనేజీలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లి గ్రామానికి చెందిన సర్వేసు (42) జీవనోపాధి నిమిత్తం సీలేరు పరిసర ప్రాంతాల్లో వారం రోజుల నుంచి గొడుగులు మరమ్మతులు చేసుకుంటూ స్థానిక రామాలయం వద్ద బస చేస్తున్నాడని తెలిపారు. శనివారం ఉదయం 7-8 గంటల మధ్యలో జెన్‌కో కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ఈశ్వరరావు ఇంటి సమీప కాలువలో పడి ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా జారి పడినప్పుడు తలకి బలమైన గాయం తగిలిందని దీంతో మృతి చెందినట్టు నిర్ధారించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గ్రామపెద్దల సమక్షంలో పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. సర్వేసుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు.



మృతుడు సర్వేసు

తెలుగుభాషా దినోత్సవాలకు రమేష్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - విఆర్‌పురం: శ్రీశ్రీ కళావేదిక ఆగస్టు 31న పల్నాడు జిల్లా నరసరావుపేట కొత్త రఘురామయ్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే తెలుగుభాషా దినోత్సవాలకు మన్యం కవి నూనె రమేష్‌కు ఆహ్వానం అందినట్లు తెలిపారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషాపరిరక్షణలో చేస్తున్న కృషికి గుర్తింపుగా 'తెలుగు తేజం' తెలుగు భాషాసేవా పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. ఆహ్వానం అందటంపై నూనె రమేష్ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



నూనె రమేష్

బొమ్మలపేటలో బోరుకు మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి-అడ్డతీగల : స్థానిక మండల కేంద్రం అల్లూరి సీతారామరాజు కాలనీలో బొమ్మల పేటలో 20 సంవత్సరాలుగా గుక్కెడు నీటి కోసం చాలాదూరం వెళ్లాల్సి వస్తోందని ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులను కలసినా పట్టించుకోలేదని బొమ్మల పేట గ్రామస్తులు తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, యువజన నాయకులు విజయభాస్కర్ చొరవ చూపి వారికి బోరు వేయించడంతో పాటు శనివారం మోటారు ఏర్పాటు చేసి నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు.



మోటారు వేస్తున్న సిబ్బంది

గోడు వినే నాథుడేడీ ?

▶▶ భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టులు ▶▶ ఆటలతో గడుపుతున్న విద్యార్థులు ▶▶ దిగజారుతున్న విద్య

ప్రజాశక్తి- అనంతగిరి: పాఠశాలలు తెరిచి మూడు నెలలు కావస్తున్నా సర్కార్ బడుల్లో టీచర్స్ నియామకం చేయక పోవడంతో విద్య అందని ద్రాక్షగా మారింది. టీచర్స్ లేకపోవడంతో గిరిజన విద్యార్థులకు అక్షర జ్ఞానం అందని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు వ్యవసాయ పనులు, పశువుల కాపరిగా మారుతున్న దుస్థితి కూటమి ప్రభుత్వంలో నెలకొంది. విద్య, వైద్యం కోసం పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలకే పరిమితమైందే తప్ప ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాలలో పేద గిరిజన విద్యార్థులకు గుణాత్మకతో కూడిన మెరుగైన విద్య అందించని దుస్థితి నెలకొంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో 27 ప్రభుత్వ ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలకు టీచర్ల కొరత నెలకొంది. అనంతగిరి స్కూల్స్ కాంప్లెక్స్ పరిధిలో జిపిఎస్‌టీ డబ్ల్యూ లక్ష్మీపురం పాఠశాలలో 30 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో గత ఏడాదిలో పని చేసిన ఉపాధ్యాయులు పాఠశాలల రీ ఓపెన్‌కు ముందు బదిలీ అయ్యారు. అనంతరం పాఠశాలలో జాయినింగ్ అయిన టీచర్ బీఈడీ ఉన్నత చదువు పై వెళ్లారు. ఇక్కడ బాషా వాలంటీర్‌తో విద్య కొనసాగుతోంది.

వేంగడ పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో పని చేసిన టీచర్ కూడా బదిలీపై వెళ్లారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొంది.

కాకరపాడు పాఠశాలలో 41మంది విద్యార్థులు ఉన్నారు గత రెండు సంవత్సరాల నుండి పూర్తి స్థాయి టీచర్ లేరు, గత ఏడాది వేంగడ పాఠశాల నుండి టీచర్‌ను డిప్యూటేషన్ కింద వారానికి మూడు రోజులు వచ్చేవారు. దిగువశొనభ పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది ఇక్కడ చేసిన టీచర్ బదిలీ పై వెళ్లారు. బీసుపురం.పాఠశాల లో కూడా అదే పరిస్థితి నెలకొంది. అరకు మెయిన్ రోడ్డుకి ఆనుకుని ఈ పాఠశాల ఉంది. ఇక్కడ బాషా వాలంటీర్‌తో కొనసాగుతోంది.కమలాపురం, బొర్రా స్కూల్ కాంప్లెక్స్ పరిధి సారగుడ, చిలకలగెడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధి గూడెం, చొట్టడవలస, పెదరాబా, పెద్దకోనేల, గాదిలోవ, జిలుగులపాడు, బీంపులు స్కూల్ కాంప్లెక్స్ పరిధి శంకుపర్తి, బిల్లకొట, చిప్పపల్లి, శివలింగపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధి సీతంపేట, పిన్నకోట స్కూల్ కాంప్లెక్స్ పరిధి పోడెల్తి, వేలమామిడి, బొంగిజా, బెంబి, సరియా, పెద్దకోట స్కూల్ కాంప్లెక్స్ పరిధి మల్లెపాడు, కర్రిగోడ, కుంబర్తి, చీడివలస పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. రోజు బడికి వెళ్లిన విద్యార్థులు ఆటలాడుతూ నిరాశనతో వెనుతిరిగుతున్నారు. ఉపాధ్యాయులను నియమించాలని పలు మార్లు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం కనీసం పట్టించు కోకుండా అలా నెట్టుకొస్తోంది.



చీడివలస పాఠశాలలో టీచర్ లేక పోవడంతో స్వంతంగా చదువుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వానికి నివేదిక అందించాం

ప్రభుత్వానికి నివేదిక అందించాం. మండలంలోని 27 ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలకు టీచర్ల కొరత ఉంది . ఈ పాఠశాలలకు టీచర్స్‌లను నియమించాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం.

బాలాజీ
మండల విద్యాశాఖ అధికారి

బడికి వెళ్లాలంటే గెడ్డను దాటాల్సిందే!



గెడ్డ అవతల నిలబడ్డ విద్యార్థులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు పంచాయితీ పరిధిలోని గేదెలపాడు జంక్షన్ నుండి పొర్లు, గొప్పగరువు, దిగా పొర్లు గ్రామాల ఉన్నాయి. రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పొర్లు, గొప్పగరువు రెండు గ్రామాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు గవ్వల మామిడి జిపిఎస్ పాఠశాలకు రోజూ 2 కిలోమీటర్లు కాలిబాటన నడిచి వెళ్ళాలి. గొప్ప గరువు, గవ్వలు మామిడి మధ్యలో ఉన్న గెడ్డను దాటేందుకు విద్యార్థులు భయాదోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ఈ గెడ్డలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు పుస్తకాలను తలపై పెట్టుకుని నీటిలో దాటుతున్నారు.అధికారులు స్పందించి రహదారి, కల్వర్టు నిర్మాణం చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



గెడ్డను దాటుతున్న వద్యార్థులు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు హాజరై స్కీం వర్కర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయాలని చూస్తోందన్నారు. దీంతో సంఘం పెట్టుకునే అవకాశం, సమ్మె, పనిగంటలు, కనీస వేతనాలు వంటి హక్కులు కోల్పోతారన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. ఆశా, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 వేలు రూ చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. వెలుగు వివోఏ మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. ఆశా, అంగన్వాడీలు, వివోఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దీసఅంబ, మహేష్, మోదకొండమ్మ, అన్నపూర్ణ, సత్యవతి, రత్నకుమారి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖేల్ కూద్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ: విద్యాభారతి ఆధ్వర్యాన ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి ఖేల్ కూద్ పేరుతో విశాఖనగర్‌లోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు భారతి విద్యా కేంద్రం ప్రెసిడెంట్, ఎయు మాజీ వైస్ ఛాన్సలర్ గొల్లపల్లి నాగేశ్వరరావు తెలిపారు. విశాఖ నగర్ విబికె జూనియర్ కళాశాల ఎల్పిజి భవనంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు ఈ ఆటల పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విద్యాభారతి పోటీల్లో విజేతలైన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి అర్హులవుతారని తెలిపారు. భారతీయ విద్యా కేంద్రం కార్యదర్శి వేదుళ్ల రామ సత్యనారాయణ మాట్లాడుతూ, 36 ఏళ్లుగా పాఠశాల స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో 180 విద్యాలయాల నుండి 700 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్షేత్ర ఖేల్ కూద్ ప్రముఖ్ కెఆర్‌కె సత్యనారాయణ, ప్రాంత ఖేల్ కూద్ ప్రముఖ్ కెఎస్.చక్రవర్తి మాట్లాడుతూ, 6 7 8 తరగతి వారిని బాలల కేటగిరీగా, 9, 10 తరగతుల విద్యార్థులను కిషోర్ కేటగిరీగా, 11 12 తరగతులను తరుణ కేటగిరీగా విభజించి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, హ్యాండ్ బాల్, మాల్కంబ్, బాస్కెట్‌బాల్, చదరంగం, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల స్థాయి 'స్వర్గీయ శ్రీదేవి ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్' పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ, ఎస్ఆర్‌కె ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విన్నర్స్‌గా, చిట్టివలస ఎస్‌పిఎం ఫుట్‌బాల్ క్లబ్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌కు రూ.5 వేలు, ఇతర బహుమతులు అందజేశారు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులను సత్కరించారు. కలిగొట్ల స్వర్గీయ శ్రీదేవి జయంతి సందర్భంగా, ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సూర్యనారాయణమూర్తి, భూలోకరావు, శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రోడ్లు కోత

ప్రజాశక్తి -అనంతగిరి రోడ్డు పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పూర్తికాక పోవడంతో మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కోతకు గురవుతున్నాయి. మండలంలో మారుమూల పిన్నకోట, కివర్ల, పెద్దకోట పంచాయతీల పరిధి పెదకోట మెయిన్ రోడ్డు నుండి బోనూరు సిడిమెట్టు మీదుగా పూతికపుట్టు, టెంకలబంద 12 గ్రామాలకు చెందిన రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్. పీఎం జన్మన్ పథకంలో భాగంగా 2020 సంవత్సరంలో నిధులు మంజూరు అయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లంతా వరద కోతకు గురై వాహనాలు వెళ్లలేదు. ఆ రోడ్డుపై కాలి నడకన వెళ్లేందుకు కూడా వీలు లేకుండా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు జరగకుండా ఏళ్ల తరబడి నిలిచిపోయాయని గిరిజనులు విమర్శించారు. దీంతో ఆయా గ్రామాల అనారోగ్యానికి గురైన గిరిజన ప్రజలు, గర్భిణీలను సకాలంలో ఆసుపత్రులకు వైద్యం కోసం చేర్చలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన బోనూరు, పూతికపుట్టు రోడ్డు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సీలేరులో వివిధ వేషధారణలతో ఉన్న పిల్లలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ సరభగుడ,తాంగులగుడ గ్రామంలో శనివారం రాధా కృష్ణ దేవాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 15 వందల మంది భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. రాధాకృష్ణ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పిల్లలను కృష్ణుడి వేషం వేసి ఊరేగించారు. గ్రామ పెద్దలు కిల్లో జగన్నాథం, హరి, జలంధర్, అర్జున్, ఆనంద్, సహదేవ్ మాట్లాడుతూ ఈనెల 16న ఉట్టి కొట్టే కార్యక్రమం, భారీ ఊరేపింపు నిర్వహిస్తామన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. లక్ష్మీగణపతి సెంటర్ స్థానిక రామాలయం వద్ద ఉట్టికొట్టడానికి సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. కార్యక్రమం తిలకించేందుకు ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. వ్యాపారి మణి టకిరి బుట్టి ఆర్థిక సహాయంతో చిన్నారుల వేషధారణలో విజేతలకు బహుమతులు అందజేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విఆర్ పురం: మండల కేంద్రంలోని రాజుపేట కాలనీ వడ్డిగూడెం, విఆర్ పురం, రేఖపల్లి పలు గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాజుపేట కాలనీలో శ్రీకష్ణుని వేషధారణలో పిల్లలను అలంకరించి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



విఆర్.పురంలో...

మెగా డిఎస్‌సి గిరిజన నిరుద్యోగులకు శాపం



మాట్లాడుతున్న గిరిజన నిరుద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి : గిరిజన నిరుద్యోగుల ఎన్నో ఆశలు నెరవేర్చాల్సిన మెగా డీఎస్సీ వారి జీవితాలకు శాపంగా మారిందని గిరిజన నిరుద్యోగుల సంఘం అల్లూరి జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, మెగా డీఎస్సీ సాధన సమితి నాయకులు ముర్ల విష్ణుమూర్తి, డి.రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ జీవో నెంబర్3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతానికి కేటాయించిన 470 ఉపాధ్యాయ పోస్టుల్లో గిరిజన అభ్యర్థులకు 100లో కేవలం ఆరుగురికే అవకాశం లభించిందని తెలిపారు. ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ నెల 9న పాడేరు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనులకు 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించే ప్రత్యామ్నాయ జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ జీవో విడుదల చేసి, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

ఉక్కునగరంలో చోరీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్ -6లోని 105 బి క్వార్టర్‌లో శనివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఈ క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డిజిఎం నల్లి సుందరరావు నివసిస్తున్నారు. కుటుంబీకులు శనివారం పనిమీద బయటకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న 24 తులాల బంగారం చోరీకి గురైంది. నల్లి సుందరరావు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ స్టేషన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టౌన్ షిప్‌లో తరచూ చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు జరుగుతున్నాయని, ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

లారీని ఢీకొట్టిన వ్యాన్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ క్యాబిన్‌లో ఉండిపోవడంతో పోలీసులు అతన్ని బయటకు తీశారు. తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న సిలిండర్ లోడ్ వ్యాన్ నక్కపల్లిలో ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ సిహెచ్ కృష్ణ క్యాబిన్ లో ఇరుక్కుపోయాడు. స్థానిక పోలీసులు, హైవే స్టాఫ్ సంఘటన ప్రాతంతానికి చేరుకుని వ్యాన్ డ్రైవర్ ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడగా, వ్యాన్ ముందుభాగం దెబ్బతింది. వ్యాన్ రోడ్డుపై నుండి తొలగించి, పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

వేడుకగా బాలబాట మాసపత్రిక వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలల మాసపత్రిక బాలబాట 18వ వార్షికోత్సవాన్ని విశాఖ పౌర గ్రంథాలయంలో వైభవంగా నిర్వహించారు. రచయిత్రి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ బాల సాహిత్య పురస్కార గ్రహీత, బాలబాట పత్రికా సంపాదకులు కొల్లూరి స్వరాజ్యం వెంకట రమణమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎన్.నాగేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. సంస్కతిని కాపాడేందుకు పట్టుదలతో ఈ పత్రిక నడుపుతున్నట్లు స్వరాజ్యం వెంకట రమణమ్మ తెలిపారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, భావాలు ఖచ్చితంగా చెప్పాలంటే మాతృ భాష తప్పనిసరి అన్నారు. పత్రికను నడుపుతున్నందుకు స్వరాజ్యం వెంకట రమణమ్మను అభినందించారు. గౌరవ అతిథి డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి కాలంలో బాలసాహిత్యం మీద పుస్తకాలు తక్కువగాఉన్నాయన్నారు. పిల్లలకు పఠనాసక్తి కలిగించాలన్నారు. బాలబాట పత్రికకు పూర్ణకుంభ పురస్కారాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు తరుపున ప్రకటించారు. చందమామపై గజల్ పాడి వినిపించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ, పిల్లల్లో సంస్కృతిని పెంపొందించేందుకు బాల సాహిత్యం కావాలన్నారు. రచయిత, శ్రీశ్రీ కళా వేదిక విశాఖ అధ్యక్షులు కొలచిన రామ జగన్నాథ మాట్లాడుతూ, పిల్లల్లో పత్రికలు చదివే అలవాటు తగ్గడం బాధాకరమన్నారు. నైతిక విలువలు పెంపొందించే అవసరం ఉందన్నారు. సాహితీ ప్రియులు, ప్రముఖ న్యాయవాది, జర్నలిస్టు ఉప్పల అనిల్ కుమార్ మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణకు మాతృభాష యుక్తమైనదని చెబుతూ నీతి కథను చెప్పారు. ఈ సభలో ద్వాదశి రామలక్ష్మి రచించిన "బాలగేయమాలిక" పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాఖకు చెందిన యువ చిత్రకారుడు శశాంక, పలాసకు చెందిన కవి, రచయిత తెప్పల కృష్ణమూర్తిలను బాలబాట తరుపున సన్మానించారు. విద్యార్థులు చిద్విలాస్, భవ్యశ్రీ, జానుశ్రీ, అను, సాధ్విక పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు


ప్రజాశక్తి- వేపగుంట : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో 98వ వార్డు పరిధి అడవివరం దళిత కాలనీ, విజనగిరిపాలెం, దళిత, బిసి కాలనీల్లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంవి ప్రసాదరావు నాయకత్వాన ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతమవుతున్నారని, ఇంకా ప్రజలపై భారాలు మోపొద్దని కోరారు. దళిత, గిరిజనులకు ఉచిత విద్యుత్ పథకాన్ని (జగ్జీవన్ జ్యోతి) కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న మాట్లాడుతూ, కాలనీల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వారి ఇళ్ల వద్ద పోస్టర్లను అతికించుకున్నారని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు.

'బాబాతిల్కా మాంఝీని గుర్తించకపోవడం అన్యాయం'

ప్రజాశక్తి -సీలేరు: భారతదేశ స్వాతంత్య్రం కోసం తొలుత ప్రాణ త్యాగం చేసింది ఆదివాసీ అయిన బాబా తిల్కా మాంఝీ అని, కానీ చరిత్రలో ఆ విషయం గుర్తించకపోవడం దారుణమని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా 1784లో బాబా తిల్కా మాంఝీ పోరాడి బ్రిటీష్ ప్రభుత్వం చేత ఉరి తీయబడ్డారని, కానీ చరిత్రలో ఈ విషయాన్ని చెప్పడం లేదన్నారు. బాబా తిల్కా మాంఝీ అగస్టస్ క్లీన్ ల్యాండ్ (బ్రిటీష్ కమిషనర్ (లెఫ్టినెంట్) రాజ్‌మహల్‌పై గలేల్ అనే ఆయుధంతో దాడి చేయగా అతను చనిపోయాడని, బ్రిటీష్ వారు బాబా తిల్కా మాంఝీని 1784లో పట్టుకుని ఉరితీశారు. మాంఝీని ఉరితీసిన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, బగల్పూర్ గ్రామానికి ఆయన పేరు పెట్టడం జరిగిందని, బగల్పూర్ విశ్వ విద్యాలయానికి ఆయన పేరుతో తిల్కా మాంఝీ బగల్పూర్ విశ్వవిద్యాలయం అని పేరు మార్చారని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తి పేరును ఎక్కడా ప్రస్తావించకపోవడం అన్యాయమని అన్నారు.

మనస్తాపంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి మోతుగూడెం ఏపి జెన్‌కో హాస్పిటల్ సందు పవన్‌పేట్టు గోపాల్ అప్పారావు (32) ఆర్థిక ఇబ్బందులు బాగా లేకపోవడం, గతంలో బైపాస్ సర్జరీ చేయించుకోవడం వల్ల ఆరోగ్య సమస్యల వల్ల మనసికంగా కలత చెంది ఇంట్లో ఐరన్ రాడ్‌కి ఉరివేసుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు, బిజెపి నాయకులు

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళులు

ప్రజాశక్తి - చింతూరు: చింతూరు మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి శనివారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, బిజెపి మండల అధ్యక్షులు బర్ల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు నామాల శ్రీనివాసరావు, మండల నాయకులు తమ్మిరెడ్డి రామారావు, యువమోర్చ నాయకులు జంపన్న రాజు, శివాజీ, లచ్చు చింతూరు టిడిపి మండల అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ వెంకటేష్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి-గంగవరం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం స్థానిక వైజంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించకూడదని తెలిపారు. యువత మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకంటామన్నారు. అదేవిధంగా డ్రగ్స్ రవాణాకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెల పంచాయితీ గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

కార్పొరేట్ సేవలో తరిస్తున్న ప్రభుత్వాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - రంపచోడవరం : కార్పొరేట్ సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. సిపిఐ జిల్లా మహాసభలు శనివారం రంపచోడవరంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ముందుగా పార్టీ శ్రేణులు మధ్యాహ్నం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ నుండి ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ మీదుగా సభాప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం స్టేట్‌బ్యాంక్ వద్ద బహిరంగసభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. పోలవరం నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపడంలో చంద్రబాబు, మోడీ ఇద్దరూ విఫలమయ్యారన్నారు. త్వరలోనే సిపిఐ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తానే స్వయంగా ఈ ప్రాంతంలో పోరాటం చేస్తున్నట్లు అయన ప్రకటించారు. గిరిజన ప్రజలు సమస్యలు ఈ ప్రభుత్వాలకు పట్టడం లేదని, ఎంతసేపూ అంబానీ, అదానిలకు ఈ దేశసంపద దోచిపెడుతున్నారని అన్నారు. ఈ దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు మాత్రమే అని తాము పేదప్రజలపక్షాన పోరాటం చేస్తున్నామని అందుకే పేదప్రజలు, కార్మికులు, కర్షకులు ఎర్రజెండా వెంటే ఉంటారని అన్నారు. ఒంగోలులో లక్షలాది మందితో రాష్ట్ర మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి ఎప్పుడూ మావోయిస్టులను అంతం చేయడమే మా ఎజెండా అంటూ వరుస ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని గిరిజన ప్రజల సమస్యలపై ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. రైతుసంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల బాగోగుల కోసం పోరాటం చేసే ఏకైక పార్టీ సిపిఐ అని రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసామని పోలవరం సమస్యలు పై కూడా అనేక పోరాటాలు చేస్తూనే ఉన్నామని అన్నారు. రాష్ట్ర కార్య వర్గసభ్యులు డేగ ప్రభాకర్, జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్, మహిళా నాయకురాలు దుర్గ, అల్లూరి జిల్లా 23 మండలాల నుండి సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.392 కోట్లు అభివృద్ధి నిధులు తెచ్చానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకదృష్టి సారించారన్నారు. రానున్న కాలంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గోతులమయంగా ఉన్న రోడ్లను ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే బాగు చేయించామని అలాగే ఈ సంవత్సర కాలంలో సుమారు (పిఎం జన్‌మన్) 4వేల పిటిజి ఇళ్లు మంజూరు చేశామన్నారు.మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తనపై లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఆమె నియోజకవర్గంలో పనులు పూర్తి చేయకుండానే నిధులు డ్రా చేసుకున్నారని వాటికి సంబంధించి ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే వాటిని బహిర్గతం చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్, టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశీ విశ్వనాథ్, టిడిపి నాయకులు గొర్ల సునీత, అనంత మోహన్, సలాది బాపిరాజు, వై. నిరంజని, బిజెపి నాయకులు స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: భారీవర్షాలు, వరదలు, వడగళ్ల వానవంటి సహజ విపత్తులను సమర్ధంగా ఎదుర్కొనేందుకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అన్ని విభాగాలు తక్షణమే సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్టు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత వాతావరణశాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరంలో భారీవర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ఇప్పటికే జివిఎంసి ముందస్తు చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు, మురికివాడల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నగరంలో పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేసామని, నగరంలో డ్రైనేజీ లైన్లు, మేన్‌హోల్స్ , అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడమైనదని ,త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలోనున్న హోర్డింగులను తొలగించే ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జివిఎంసి వాహనాలు, జనరేటర్లను,చెట్లను తొలగించే యంత్రాలను, జెసిబిలను, ట్రక్కులను సిద్ధం చేయాలని, ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. అత్యవసర సహాయం కోసం జివిఎంసి కంట్రోల్ రూమ్ లో టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు సంప్రదించాలని, సూచించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సై రవీంద్ర సిబ్బందితో నిఘా పెట్టారు. రెండు రోజుల నుంచి ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గంజాయి రవాణా, సాగు చట్టరీత్యా నేరమని మారుమూల గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణాచేసే స్మగ్లర్లు వారికి సహకరిస్తున్న వారు ఎవరు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. సీలేరు ప్రధాన కూడలి, ఎపి జెన్‌కో చెక్‌పోస్ట్ మెయిన్ డ్యాం తదితర ప్రాంతాల్లో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

దళితుల ఐక్యతపై మోడీ ప్రభుత్వం కుట్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతపై బిజెపి ప్రధాని మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఈ కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు కొన్ని రాజకీయ పార్టీలు మాల సామాజికవర్గంపై పగబట్టి అణగతొక్కేందుకు చూస్తున్నారని ఎస్సీలు అందరూ ఐక్య ఉద్యమానికి పోరుబాట పట్టాలని రాక్స్ అండ్ మాలమహానాడు అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ పిలుపునిచ్చారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం, ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రప్రభుత్వాల పరిధిలో లేదన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా వర్గీకరణ అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం, ఇప్పటికీ తన స్టాండ్ ఏంటో చెప్పకపోవడం,అత్యంత బాధాకరమన్నారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థల్ని మోడీ నిర్వీర్యం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాల్సిందేనన్నారు.

పార్లమెంట్‌లో అమెండ్‌మెంట్ చేసేవరకు, ఇప్పుడు ఇచ్చిన ఏడుగురు జడ్జిల తీర్పును 11 అంతకన్నా ఎక్కువ జడ్జిలతో ఎస్సీ వర్గీకరణ తీర్పును పున:సమీక్షించేంతవరకు ఈ శాంతియుత పోరాటం కొనసాగుతుందన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు గొల్ల ఈశ్వరరావు, మత్తి రత్నారావు, గొడుగురాజు, సిమ్మాల దుర్గాప్రసాద్, శ్యామలరావు,నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.

పదేళ్ల వారంటీ ప్రణాళికతో న్యూ నిస్సాన్ మాగ్నిట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: నిస్సాన్ మోటార్ ఇండియా కొత్త నిస్సాన్ మాగ్నిట్ కోసం 10 సంవత్సరాలు పొడిగించిన వారంటీ ప్రణాళికను ప్రారంభించిందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండి సౌరాబ్ వాట్సా తెలిపారు. శనివారం విశాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాణ్యత, విశ్వసనీయత బ్రాండ్‌యొక్క దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్తనిస్సాన్ మాగ్నైట్‌కు పలు అత్యాధునిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ వాహనం ప్రయాణికుల భద్రతపై 5 స్టార్ రేటింగ్ సాధించిందని, 3 సంవత్సరాల ప్రామాణిక వారంటీతో పాటు 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ అందిస్తున్నామన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్‌కు స్పెషల్ ఎడిషన్‌ను సైతం త్వరలో ప్రారంభించినట్టు చెప్పారు. తమ సంస్థ దేశవ్యాప్తంగా నగదు రహిత మరమ్మతులను అందిస్తుందన్నారు.

నేడు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు 'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి జి.ఎస్.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ముఖ్య వక్తలుగా ఆంధ్రా యూనివర్సిటీ హిస్టరీ డిపార్ట్మెంట్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కె.సూర్యనారాయణ, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.